## గిరి నేచర్ పోషక మిల్లెట్ స్నాక్స్ ఆవిష్కరణ



గిరి నేచర్–పోషక మిల్లెట్ స్నాక్స్‌ను ఆవిష్కరించిన టీజీజీసీసీ చైర్మన్ తిరుపతి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి ఎ.శరత్, న్యూట్రిహబ్–ఐసీఏఆర్–ఐఐఎంఆర్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ బి.దయాకర్‌రావు తదితరులు

అబిడ్స్, ఏప్రిల్ 18: తెలంగాణ గిరిజన సహకార సంస్థ లిమిటెడ్ గిరి నేచర్ బ్రాండ్‌తో తేనె మిల్లెట్ కుకీస్, తేనె చిక్కీలను ఆవిష్కరించింది. మాసాబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్, న్యూట్రిహబ్–ఐసీఏఆర్–ఐఐఎంఆర్ సీఈఓ, డైరెక్టర్ డాక్టర్ బి.దయాకర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణకే కాకుండా గిరిజనుల జీవనోపాధికి ఈ మిల్లెట్ ఆధారిత కుకీలు, చిక్కీలు రూపొందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా గిరిజన రైతులు, తయారీదారులకు మార్కెట్ అవకాశాలు కల్పించి, వారి ఉత్పత్తులు సమాజానికి ఉపయోగపడేలా వినియోగించేందుకు మార్గం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, టీజీజీసీసీ చైర్మన్ కొట్నాక్ తిరుపతి సంపూర్ణ మద్దతుతో చేపట్టినట్టు పేర్కొన్నారు. అడవుల్లో గిరిజన సంఘాలు సేకరించిన స్వచ్ఛమైన తేనెతో తయారైన మిల్లెట్ కుకీస్, చిక్కీలను అందిస్తోందని, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతోపాటు సమాజ సంక్షేమానికి తోడ్పడటం ఈ పథకం ప్రధాన ఉద్దేశమన్నారు.

## మేడే స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక చర్యలను తిప్పికొట్టాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపు



హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

హిమాయత్ నగర్, ఏప్రిల్18: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక విధానాలను వ్యతిరేకిస్తూ బలమైన పోరాటాలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి ముద్రించిన మేడే దినోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరణ శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఒక వైపు రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగిపోతున్నా మోదీ ప్రభుత్వంలో చలనంలేదని మండిపడ్డారు. మేడే స్ఫూర్తితో రాబోవు రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన చేసేందుకు సిద్ధం కావాలని వారు కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎస్.బాలరాజ్, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, ఉపాధ్యక్షుడు కె.ఏసురత్నం, కార్యదర్శి ఎస్.విలాస్, కార్యవర్గ సభ్యుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

## హెచ్ఐసీసీలో కొలువుదీరిన హై లైఫ్ జువెల్స్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ నటి పాయల్ రాజ్ పుత్

మాదాపూర్, ఏప్రిల్ 18: మహిళలకు ఎంతగానో నచ్చే బంగారు ఆభరణాలు మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో హైలైఫ్ జ్యువెల్స్ పేరుతో శుక్రవారం హెచ్ఐసీసీలో కొలువుదీరాయి. ఇందులో తీరొక్క డిజైన్లతో కూడిన పలు రకాల బంగారు ఆభరణాలు అందుబాటులో ఉన్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నటీమణులు పాయల్ రాజ్‌పుత్ విచ్చేసి నయని పావని, కుషిత కల్లపులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈనెల 20వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనలో 100 రకాల బ్రాండ్‌లతో కూడిన బంగారు ఆభరణాలు, షోకేస్ వెడ్డింగ్ జ్యువెలరీ, గోల్డ్ జ్యువెలరీ, డైమండ్ జ్యువలరీ, బ్రైడల్ జువెలరీ, ట్రెడిషనల్ జ్యువెలరీ వంటివి కొలువుదీరాయి.



## ఎక్కడి సమస్యలు అక్కడే

వేతనాలు రాకపోవడంతో మేడ్చల్ జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో కార్మికులు ఆందోళన బాటపట్టడంతో ఇబ్బందులు తలెత్తున్నాయి. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు, తాగునీటి ఇబ్బందులతో ప్రజలు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు.

*– మేడ్చల్/శామీర్‌పేట ఏప్రిల్ 18*

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
లీగల్ ప్రకటనలు
స్థలాల కొనుగోలు, అమ్మకాలు మరియు లీగల్ ప్రకటనల కొరకు సంప్రదించగలరు.
లీగల్ ప్రకటనపై 30% డిస్కౌంట్ ఇవ్వబడును
నమస్తే తెలంగాణ
ప్రకటనల విభాగం... సెల్: 9848077857

| | | | |
|---|---|---|---|
| సికింద్రాబాద్ | :9182777694 | చిక్కడపల్లి | :9182777709 |
| కూకట్‌పల్లి | :91827 77681 | ఉప్పల్ | :9182777697 |
| కుత్బుల్లాపూర్ | :9182777682 | మల్కాజిగిరి | : 9182777702 |
| ఓల్డ్ సిటీ | :9182777275 | ఎల్బీనగర్ | :9182777707 |
| నాంపల్లి | :8096660631 | మలక్‌పేట | :9182777693 |


# లిక్కర్‌తో లివర్‌కు చేటు

- మద్యపానం, ఫ్యాటీ లివర్ బాధితులకే అధిక ముప్పు
- 95శాతం లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు సక్సెస్
- కాలేయ సమస్యకు జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు
- స్టార్ ఆసుపత్రిలో లివర్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రారంభం
- నేడు 'ప్రపంచ కాలేయ దినోత్సవం'




సేవల వివరాలు తెలియజేస్తున్న స్టార్ ఆసుపత్రి వైద్యులు

సిటీబ్యూరో, ఏప్రిల్18, (నమస్తే తెలంగాణ): మానవుని జీవనశైలిలో సంభవిస్తున్న మార్పులే కాలేయ వ్యాధికి దారితీస్తున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా నాన్–అల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్, మద్యపానం తాగేవారే లివర్ సమస్యతో బాధపడుతున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రాసెస్డ్ ఫుడ్, పంచదార, కొవ్వు పదార్థాలు మితిమీరి తీసుకోవడం, కదలికలేని జీవనశైలి వల్ల బరువు పెరడం మూలానా ఫ్యాటీ లివర్, టైప్ 2 డయాబెటిస్, మెటబాలిక్ సిండ్రోమ్ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. మద్య పానాన్ని మానుకోవడం, సురక్షిత లైంగిక సంబంధాలు, డ్రగ్స్‌కు దూరంగా ఉండటం వల్ల జీవనశైలిలో నూతన మార్పులు మొదలై మన కాలేయాన్ని కాపాడుకోగలగిన వారమవుతాం. నేడు 'ప్రపంచ కాలేయ దినోత్సవం' సందర్భంగా కాలేయ వ్యాధి గురించి అవగాహన పెంచుకోవడం అత్యంత అవసరం.

### మద్యం మానేసి..బరువు తగ్గి..

ఎక్కువగా మద్యం తీసుకోవడం వలన లివర్, ప్యాంక్రియాస్, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతుంది. లివర్ వ్యాధి ప్రారంభ దశలో లక్షణాలు కనిపించవు. మొదటగా హెపటైటిస్ వస్తుంది, దీని నుంచి సిరోసిస్ (లివర్ గట్టిపడటం) దశకు చేరుకోవడానికి 5–15 ఏండ్లు పడుతుంది. లక్షణాలు కనిపించే సమయానికి వ్యాధి ముందంజలోకి చేరుతుంది. ఫ్యాటీ లివర్‌కు మందులు తక్కువ ఉపయోగపడుతాయి. జీవనశైలి మార్పుల ద్వారా బరువు తగ్గడం మాత్రమే ఫ్యాటీ లివర్‌ను రివర్స్ చేయగలదు. బరువు తగ్గడం ద్వారా ఫైబ్రోసిస్, సిరోసిస్ నుంచి తప్పించుకోవచ్చు.

### స్క్రీనింగ్ చేయించుకోవడం ఉత్తమం

లివర్ క్యాన్సర్ మొదటి దశలో ఏ లక్షణాలు కనిపించవు. జాండిస్ నెమ్మదిగా వ్యాపిస్తున్నది. మన దేశంలో జాండిస్ వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా నాటు వైద్యం చేయిస్తుంటారు. నాటు వైద్యం వల్ల అనేకమంది డ్రగ్–ఇండ్యూస్డ్ లివర్ ఇంజురీకి గురవుతున్నారు. జాండిస్ అనేది ఒక లక్షణం మాత్రమే, వ్యాధి కాదు. ఇది రాళ్లు, క్యాన్సర్, ఇన్‌ఫెక్షన్లు, రక్త సంబంధిత వ్యాధుల కారణంగా వస్తుంది, దీనికి నిపుణుల పరిశీలన అవసరం. మద్యం సేవించేవారు, నాన్–అల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్, హెపటైటిస్ బి, సి, మెటబాలిక్ వ్యాధులున్న వారు క్రమం తప్పకుండా స్క్రీనింగ్ చేయించుకోవడం ఉత్తమం. లివర్ క్యాన్సర్‌కు రేడియోథెరపీ, సాధారణ కీమోథెరపీ పని చేయవు. ప్రత్యేక టార్గెట్ థెరపీ, ఇమ్యునోథెరపీ, స్థానికంగా చేసే ట్రీట్‌మెంట్లు(టీఏసీఈ, టీఏఆర్ఈ, ఆర్ఎఫ్ఏ) అవసరం. లివర్ ఆకారాన్ని కాకుండా, దాని పని తీరును బట్టి ట్రాన్స్‌ప్లాంట్ అవసరమా? లేదో నిర్ణయిస్తారు.

### స్టార్ ఆసుపత్రిలో లివర్ హెల్త్ ఇనిషియేటివ్ ప్రారంభం..

ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా నానక్‌రాంగూడలోని స్టార్ హాస్పిటల్ 'లివర్ హెల్త్ ఇనిషియేటివ్' ప్రారంభించింది. నాలుగు ప్రత్యేక లివర్ క్లినిక్‌లు ప్రారంభించగా, కాలేయ సంబంధిత వ్యాధులను తొలి దశలోనే గుర్తించి, నివారించి, నిపుణుల ద్వారా చికిత్స అందించడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు. ముఖ్యంగా నాన్–అల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్, వైరల్ హెపటైటిస్ వంటి సమస్యలపై దృష్టి సారించనున్నారు. భారతదేశంలో జనాభాలో సుమారు 35% మంది నాన్–అల్కహాలిక్ ఫ్యాటి లివర్ డిసీజ్‌తో బాధపడుతున్నారు. వీరిలో 88% మందిలో డయాబెటిస్ ఉండటం గమనార్హం. సాధారణ బాడీ మాస్ ఇండెక్స్(బీఎంఐ) ఉన్న వారిలో కూడా 7–20% వరకూ ఈ వ్యాధి కనిపిస్తున్నది. దీనినే 'లీన్ నాష్' అంటారు. దీనికి చికిత్స అందించకుంటే లివర్ సిరోసిస్, ఫెయిల్యూర్‌కు దారితీయొచ్చు. స్టార్ లివర్ ఇనిస్టిట్యూట్ ద్వారా ఇలాంటి రోగులకు త్వరగా చర్యలు తీసుకొని, జీవనశైలి మార్పుల ద్వారా చికిత్స చేయడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

### 95శాతం విజయవంతమవుతున్నాయి..



దేశంలో ఏటా 5000 కంటే ఎక్కువ ట్రాన్స్‌ప్లాంట్లు జరుగుతున్నాయి, 90–95% విజయం సాధిస్తున్నాం. పేషెంట్ ఆరోగ్య స్థితి మరియు వ్యాధి తీవ్రతపై ఆధారపడి ఫలితాలు మారుతాయి. వ్యాధి లక్షణాలు ఉంటే ఆలస్యం చేయకుండా వైద్యనిపుణులను సంప్రదించడం అత్యంత అవసరం.

*– డా. రావుల ఫణి కృష్ణ, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, కిమ్స్ హాస్పిటల్స్, కొండాపూర్*

## వారసత్వ సంపద కాపాడుకుందాం



సిటీబ్యూరో, ఏప్రిల్ 18(నమస్తే తెలంగాణ): నగర వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ చైర్మన్ వేద కుమార్ మణికొండ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఉదయం డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, పురావస్తు శాఖ హైదరాబాద్ సర్కిల్, తెలంగాణ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ, ఫోరం ఫర్ ఏ బెటర్ హైదరాబాద్ తదితర పౌర సంఘాల ఆధ్వర్యంలో చార్మినార్ వద్ద హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ చారిత్రక ఘనతను ప్రజలకు తెలియపరుస్తూ, వారసత్వ పరిరక్షణ, పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరాన్ని వివరించారు. చార్మినార్ మీదుగా లాడ్ బజార్, మోతిగల్లి, మెహబూబ్ చౌక్(ముర్గీ చౌక్), ఇక్బాల్ ఉద్ దౌలా దేవ్డీ, మక్కా మసీదు ద్వితీయ ద్వారం, జిలుఖానా, ఖుర్షీద్ జా బహదూర్ ప్యాలెస్, ఇక్బాల్ ఉద్ దౌలా ప్యాలెస్, ఖిలావత్, చౌమహల్లా ప్యాలెస్ వద్ద ఈ వాక్ ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సూర్యనారాయణ మూర్తి, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

## నీటి సరఫరాకు అంతరాయం

సిటీబ్యూరో, ఏప్రిల్18(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మహా నగరానికి తాగు నీరు సరఫరా చేసే సింగూరు 3 ఫేజులకు విద్యుత్తు సరఫరా చేసే పెద్దాపూర్132 కేవీ వద్ద టీజీ ట్రాన్స్కో అధికారులు మరమ్మతులు, జలమండలి సిబ్బంది లీకేజీ పనులు చేపట్టారు. బంజారాహిల్స్, సోమాజిగూడ, జూబ్లీ హిల్స్, తట్టిఖానా, ఎర్రగడ్డ, వెంగల్ రావు నగర్, ఎస్.ఆర్.నగర్, ఫతేనగర్, ఎల్లారెడ్డిగూడ, ఎస్పీఆర్ హిల్స్, బోరబండ, కేపీహెచ్‌బీ కాలనీ, బాలాజీ నగర్, కూకట్‌పల్లి, బాలానగర్, మూసాపేట, భారత్ నగర్, మోతీనగర్, గాయత్రీ నగర్, కొండాపూర్, డోయెన్స్ కాలనీ, మయూరినగర్, హఫీజ్‌పేట్, షేక్ పేట్, భోజగుట్ట రిజర్వాయర్, మణికొండ, నార్సింగి, మంచిరేవుల ప్రాంతాల్లో నీటి అంతరాయం ఏర్పడనున్నట్లు జలమండలి అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## రైతులకు అండగా పతంజలి



మౌగంజ్ జిల్లాలోని బంజరు, సాగు చేయని భూమిని రైతులకు ఉపయోగపడేలా పతంజలి సంస్థ శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి రాజేంద్ర శుక్లా, సంబంధిత శాఖాధికారులు ఆ భూములను పతంజలి సంస్థకు అప్పగించినట్టు పతంజలి యోగాపీఠ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. కాగా, ఈ ప్రాంతంలో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయబోతునట్టు వివరించారు. ఇందులో పంటల వైవిధ్య శిక్షణ కేంద్రాలు, విత్తన యూనిట్లు, ప్రాథమిక ప్రాసెసింగ్ యూనిట్లు ఉంటాయని చెప్పారు. ఈ ప్రాజెక్టు విజయవంతంగా అమలైతే రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

*– సిటీబ్యూరో*




## వన్ బై ఎంఎస్ఎన్‌ను ఆవిష్కరించిన ఎంఎస్ఎన్ రియాల్టీ

సిటీబ్యూరో: ఎంఎస్ఎన్ రియాల్టీ తమ తొలి ప్రాజెక్టు 'వన్ బై ఎంఎస్ఎన్'ను ఆవిష్కరించింది. ఇది నియోపోలీస్‌లో విలాసవంతమైన నివాసాలకు ఒక మైలురాయిగా నిలవనుంది. కోకాపేటలో ఉన్ననీ ప్రత్యేక ప్రాజెక్టు 7.7 ఎకరాలలో విస్తరించి ఉంది. ఇందులో 55 అంతస్థుల ఎత్తుతో కూడిన ఐదు టవర్లు ఉన్నాయి. ఈ ప్రాజెక్టు 5,250 నుంచి 7,460 చదరపు అడుగుల విస్తీర్ణంలో 655 నివాసాలను అందిస్తోంది. రూ.2750 కోట్ల ప్రణాళికబద్ధమైన పెట్టుబడితో వన్ బై ఎ ంఎస్ఎన్ ఫ్లాగ్‌షిప్ లాంచ్ అయినట్టు నిర్వాహకులు తెలిపారు.



చార్మినార్ వద్ద జలమయం..



కంట్రోల్ రూమ్ మెయిన్ రోడ్డులో గాలి బీభత్సానికి కార్లపై విరిగిపడిన చెట్టు

# వాన బీభత్సం



బేగంపేటలో వర్షంతో నిలిచిపోయిన ట్రాఫిక్



అసెంబ్లీ ఏరియాలో...



సెక్రటేరియట్ ఏరియాలో...

### మరో రెండ్రోజులు వర్ష సూచన

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల మరో రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు. వానలు, మరికొన్ని చోట్ల మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

మొదటి పేజీ తరువాయి..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా బండ్లగూడలో 8.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. బహదూర్‌పుర 7.8 సెంటీమీటర్లు, చార్మినార్ 7.6, నాంపల్లి 7, బండ్లగూడ మేకల మండి కమ్యూనిటీ హాల్ 7, చార్మినార్ మలక్‌పేట సర్కిల్ 6.6, చాంద్రయాణగుట్ట 6.1 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ తెలిపింది.

### గంటల పాటు నిలిచిన విద్యుత్..

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గంటలకొద్దీ నిలిచిపోయింది. ప్రధానంగా చాలా ఏరియాల్లో చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలపై పడడం, కొన్నిచోట్ల తీగలు తెగిపోవడంతో పునరుద్ధరణలో తీవ్ర జాప్యం జరిగింది. నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని రోడ్డుపై ఓ భారీవృక్షం కూలిపోయి ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. దీంతో అది ఒక్కసారిగా పేలిపోయింది. లంగర్‌హౌస్ బాపూనగర్ కాలనీలో చెట్టు కూలి రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి..లంగర్‌హౌస్ బాపూనగర్ వద్ద గాలివానకు రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోవడంతో పాటు విద్యుత్ తీగలపై పడడంతో స్తంభం వంగిపోయింది. మోతీలాల్ నగర్, బడంగ్‌పేట, సరూర్‌నగర్‌లోని త్రివేణినగర్, మలక్‌పేట, గ్రీన్‌హిల్స్, సాయి ఎంక్లేవ్ హబ్సిగూడ, బజార్‌ఘట్ తదితర చోట్ల ఫీడర్లపై ఫ్లెక్సీలు, చెట్ల కొమ్మలు పడడంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నగరవ్యాప్తంగా సుమారుగా 441 ఫీడర్లు ట్రిప్ అయ్యాయి. సైదాబాద్ కాలనీ జయనగర్ ఫీడర్‌పై చెట్టు కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మలక్‌పేట, ఇందిరాపార్క్, మొఘల్‌పుర, యాకుత్‌పుర, రాజేంద్రనగర్, బేగంపేట, షేక్‌పేట, అత్తాపూర్, సైదాబాద్, అమీర్‌పేట, ఉప్పరపల్లి, కుందన్‌బాగ్, చంచల్‌గూడ, బల్కంపేట, ఓల్డ్ మలక్‌పేట, రసూల్‌పుర తదితర ప్రాంతాల్లో 4 గంటలకు పైగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పలు ప్రాంతాల్లో కరెంటు పునరుద్ధరణలో పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది.

రోడ్లపైనే చెట్లు కూలడంతో ప్రధాన జంక్షన్ల వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సరూర్‌నగర్, విజయనగర్‌కాలనీ, కూకట్‌పల్లి, దారూసలాం, హైకోర్టు, బీఎన్‌రెడ్డినగర్, ఫలక్‌నగర్, సుల్తాన్‌బజార్, కాచిగూడ, సింధీకాలనీ, మెథడిస్ట్ కాలనీ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. దీంతో ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బషీర్‌బాగ్‌లో పీజీ లా కాలేజ్ ఎదుట రోడ్డుపై ఓ చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ట్యాంక్‌బండ్ నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్ వైపు వెళ్లే రోడ్డులో చెట్లు కూలిపోయి వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

### భారీగా స్తంభించిన ట్రాఫిక్...

ఈదురు గాలుల ధాటికి చాలా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు రోడ్లపై విరిగిపడ్డాయి. తెలుగు తల్లి ఫ్లైఓవర్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్ వెళ్లే దారిలో చెట్టు కూలింది. నాంపల్లి రెడ్ హిల్స్ కాలనీలోని ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్టు పడింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఒక్కసారిగా పేలింది. లంగర్‌హౌస్‌లోని బాపు నగర్, బేగంపేట మోతీలాల్ నగర్‌లో వృక్షాలు నేలకొరిగాయి. మరోవైపు రోడ్లపై భారీగా నీరు నిలిచిపోవడంతో నగరంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో ఇండ్లకు వెళ్లాల్సిన ఉద్యోగులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. అబిడ్స్, ఎంజే మార్కెట్, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కుత్బుల్లాపూర్, మేడ్చల్, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. గాలివానకు విద్యుత్ తీగలు తెగిపోవడం.. స్తంభాలుపడిపోవడం..ఫీడర్లు ట్రిప్ కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోగా..పునరుద్ధరణ..సహాయక చర్యల్లో జాప్యం కారణంగా నగరవాసులు అవస్థలుపడాల్సి వచ్చింది.